
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 12 మార్చి 2024





రంజాన్ వేళలు

ఇఫ్తార్ - మంగళవారం
సాయంత్రం - 6.31
సహర్ - బుధవారం
ఉదయం - 5.04



ఆమనగల్లులో రంజాన్ వేడుకలకు సిద్ధమైన మసీదు

నేటి నుంచి రంజాన్

ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. సోమవారం నెలవంక దర్శనంతో రాత్రి ఇషా నమాజ్ తర్వాత ప్రత్యేక ప్రార్థనలు(తరావీ) చేశారు. మంగళవారం నుంచి నెల రోజుల పాటు ఉపవాస దీక్ష(రోజా) పాటించనున్నారు. రంజాన్ సందర్భంగా జిల్లాలోని మసీదులను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఖర్జురాలు, ఇతర పండ్లు విక్రయించే దుకాణాలు వెలిశాయి. హలీం తయారీ ప్రారంభమైంది.



ఇబ్రహీంపట్నంలో వెలసిన హలీం సెంటర్



మహేశ్వరం మండలం నాగారంలో విద్యుత్ వెలుగుల్లో మసీదు

కష్టాల కడలిలో.. నష్టాల ఊబిలో ఎదురీదుతూ రైతులను కలవరపెడుతున్న వ్యవసాయాన్ని.. అవగాహనతో చేస్తే లాభాలు సాధ్యమే అని నిరూపిస్తున్నాడు ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. సంప్రదాయ పద్ధతులను పక్కనబెట్టి కొత్తగా ఆలోచించి ఆచరణలో పెట్టి భేష్ అనిపించుకుంటున్నాడు వెంకట రమణ. ఒకవైపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే మరోవైపు వ్యవసాయంపై దృష్టి పెట్టి సేంద్రియ సేద్యంతో నాణ్యత గల కూరగాయలను పండిస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

- నెలకు రూ.4.50లక్షల వరకు ఆదాయం
- సేద్యాన్ని లాభాల బాట పట్టించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- సేంద్రియ సాగుతో నాణ్యతగా ముందడుగు
- ప్రత్యేకతను చాటుతున్న వెంకటరమణ



మల్చింగ్ విధానంలో సాగవుతున్న పాలకూర

టెకీ సాగు.. అదుర్స్

పదెకరాల్లో 25 రకాల కూరగాయ పంటల సేద్యం



ఎరుపు బెండ

అందుకే ఈ మార్గాన్ని ఎంచుకున్నా



ప్రతీదీ కల్తీ అవుతున్న ఈ రోజుల్లో ప్రజారోగ్యం దృష్ట్యా నాణ్యమైన కూరగాయలను ప్రజలకు అందించాలన్న లక్ష్యంతోనే సేంద్రియ సాగులోకి దిగాను. విత్తనాలు వేసి నెలలకొద్దీ పంట కోసం వేచి చూడటం నాకు ఇష్టం లేదు. మల్చింగ్, అండర్ రూఫ్, గ్రీన్ హౌస్ తదితర ఆధునిక పద్ధతుల్లో పంటలు పండిస్తూ ఆర్జిస్తున్నాను. ఒకపక్క ఉద్యోగంతో చేస్తూనే నాకిష్టమైన రంగాన్ని ఎంచుకొని దానిలో విజయవంతం కావడం సంతోషంగా ఉంది.

- వెంకటరమణ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

షాద్‌నగర్, మార్చి 11 : మహబూబ్‌నగర్ జిల్లా బాలనగర్ మండలానికి చెందిన వెంకటరమణ(40) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోంతో రాత్రి పూట విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయమంతా ఖాళీగా ఉండడంతో తనకిష్టమైన కూరగాయల సాగుపై ఆసక్తి చూపాడు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌లో 10గుంటల భూమి లీజుకు తీసుకొని సేంద్రియ ఎరువులతో కూరగాయలు పండించడం ప్రారంభించాడు. అది విజయవంతమై కొంత మేర లాభాలు ఆర్జించాడు. దీంతో మరింత ఉత్సాహంతో మరో 10ఎకరాలు లీజుకు తీసుకొని 25రకాల కూరగాయలు పండించడం మొదలుపెట్టాడు ఎరుపు బెండ, తెల్ల బెండ, మూడు రకాల వంకాయలు, మూడు రకాల టమాటాలు, బీర, దోస, బీన్స్, చిక్కుడు, సొరకాయ, ఆలుగడ్డ, క్యాబేజి, మిరప, పుచ్చకాయ, బొప్పాయి, ముల్లంగి, కాకర, పొట్లకాయ, బీట్రూట్, గోరు చిక్కుడు తదితర కూరగాయలు, పాలకూర, మెంతికూర, గోంగూర, కొత్తిమీర, తోటకూర, ఎరుపు తోటకూర, పాయిల్ కూర, పుదీన తదితర ఆకు కూరలను సాగు చేస్తున్నాడు. ఈ పంటలన్నీ ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులతోనే సాగుచేస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నాడు. నాణ్యమైన, ఆరోగ్యకర కూరగాయలు వినియోగదారులకు అందిస్తున్నాడు. ఇదిలా ఉంటే పదెకరాల్లోనూ కేవలం ఒకే ఒక్క బోరుతో బిందు సేద్యంతో లీజు తీసుకున్న భూమినంతటినీ సాగు చేస్తుండడం గమనార్హం.



సొర సాగు

చేను వద్దకే చిరు వ్యాపారులు!

ఇక వెంకటరమణ కృషి గురించి చెప్పుకుంటే మొదట రూ.35 లక్షలతో సాగును ప్రారంచాడు. ప్రతీరోజూ 500 కిలోల వరకు కూరగాయలను మార్కెటింగ్ చేసి రోజుకు రూ.15వేల చొప్పున నెలకు 4.5లక్షల వరకు ఆదాయాన్ని ఆర్జించాడు. కూరగాయల చిరు వ్యాపారులు హైదరాబాద్ నుంచి నేరుగా ఇతడి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి హోల్‌సేల్‌గా కొనుక్కొని వెళ్తారు. దీంతో వెంకటరమణకు కూరగాయల లోడ్‌ను మార్కెట్‌కు తరలించే ఖర్చులు సైతం తప్పాయి. ఈయన అన్ని రకాల పంటలను పండిస్తున్నందున కొన్ని కూరగాయలకు ధరలు లేకున్నా ధర ఉన్న వాటితో నష్టాన్ని పూడ్చుకుంటాడు. ఈ విధానమే ఓ రకంగా అతడి విజయ రహస్యంగా చెప్పవచ్చు. సాగు చేసిన పంటలు త్వరగా చేతికందేలా ఆధునిక సాగు పద్ధతులు అవలంభిస్తాడు. పంట తొందరగా చేతికంది రోజు వారీ ఆదాయం పెరగడమే తప్ప తరుగుదల లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాడు. ఇతడి భార్య కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగే. వారికి ఇద్దరు సంతానం. భార్య, పిల్లలు ఉద్యోగ రీత్యా బెంగళూరులో ఉంటున్నా వెంకటరమణ వర్క్ ఫ్రంహోంతో అటు ఉద్యోగం, ఇటు వ్యవసాయం రెండూ చేస్తూ నాలుగు చేతులా సంపాదిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.



టమాట సాగు

ఆసియా పవర్ లిఫ్టింగ్‌లో దీపక్‌కు 3 స్వర్ణాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా ఓపెన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రంగారెడ్డి జిల్లాకు చెందిన పి.మోహ్నిష్ దీపక్ మూడు స్వర్ణ పతకాలు కొల్లగొట్టాడు. ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కిర్గిస్థాన్‌లో జరిగిన ఈ పోటీల్లో దీపక్ మొత్తంగా 557.5 కిలోల బరువెత్తి సంచలనం సృష్టించాడు. స్క్వాట్‌లో 222.5 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 125కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 225 కిలోల బరువెత్తి, మూడు పసిడి పతకాలు సాధించాడు. దీపక్‌ను డబ్ల్యూపీసీ తెలంగాణ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఇంటూరి రేఖ అభినందించారు.

పోలో రన్నరప్‌గా భారత్



అవార్డు అందుకుంటున్న విశాల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అంతర్జాతీయ పోలో చాంపియన్‌షిప్‌లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో జరుగుతున్న ఈ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్లో అమెరికా జట్టు 15-8తో భారత్ టీమ్‌పై గెలిచింది. లీగ్ ఆసాంతం భారత జట్టు తరపున అద్భుతంగా ఆడిన హైదరాబాద్ ప్లేయర్ విశాల్‌కు ఉత్తమ ఆటగాడి అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, రాధా టీఎంటీ చైర్మన్ సునీల్ ట్రోఫీలు ప్రదానం చేశారు.

సీఎంను కలిసిన 'చింపుల'

- టీఎస్‌పీసీబీ సభ్యుడిగా నియామకం పట్ల కృతజ్ఞతలు



సీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 11 : తనను రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) సభ్యుడిగా నియమించినందుకు చింపుల సత్యనారాయణరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సత్యనారాయణరెడ్డి సోమవారం సీఎం నివాసానికి వెళ్లి వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందించారు. తనపై నమ్మకంతో కేటాయించిన పదవికి న్యాయం చేస్తానని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేసే బాధ్యత బోర్డు సభ్యుడిగా తనపై ఉందని గుర్తు చేశారు. రోజు రోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు.

చరికొండ వేణుగోపాలస్వామి ఆలయంలో

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- ఆరు రోజుల పాటు కొనసాగింపు
- 15న స్వామివారి కల్యాణం, రథోత్సవం

కడ్తాల్ ,ఫిబ్రవరి 11: కడ్తాల మండలం చరికొండ శ్రీ రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. మంగళవారం నుంచి 17వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని శోభాయామానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. ఆరు రోజుల పాటు కొనసాగే ఉత్సవాల కోసం నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ వ్యవస్థాపకులు, ధర్మకర్త, అర్చకుడు చక్రవర్తి శ్రీనివాసాచార్య వివరించారు. మంగళవారం స్వామివారికి అభిషేకం, స్వస్తి వాచకం, ఋుతిగ్వరణం, అంకురార్పణ, 13న ధ్వజారోహణం, భేరి పూజ, దేవతాహ్వానం, 14న మోహినీ సేవ, విష్ణుసహస్ర నామం, అర్చనలు, గరుడ సేవ, ఎదుర్కోళ్లు, 15న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం, రాత్రికి రథోత్సవం, 16న స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, ఆంజనేయ స్వామి అష్టోత్తర నామావళి, అశ్వవాహనం, లంకాదహనం, 17న పూర్ణాహుతి, చక్రతీర్థం, బండ్ల పూజలు, దేవత విసర్జనం, ఆరాధన, మూగబలి కార్యక్రమాలు ఉంటాయని ఆయన వెల్లడించారు.



ఆలయంలో కొలువుదీరిన స్వామి వారి మూలవిరాట్

18న వేంకటేశ్వర స్వామి కల్యాణం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని అలివేలుమంగ సమేత శ్రీ వెంకటగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఇక్కడ కన్నుల పండువగా నిర్వహిస్తారు. 16వ తేది నుంచి 20 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ప్రధాన అర్చకుడు గూడ క్రిష్ణమాచార్య వివరించారు. 16న విశ్వక్సేన ఆరాధన, పుణ్యహవాచనం, అంకురార్పణం, దేవతాహ్వానం, భేరి పూజ, 17న సుప్రభాత సేవ, నిత్యారాధన, మహాభిషేకం, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, బలిహరణం, ఎదుర్కోళ్లు, 18న అలివేలు మంగ వేంకటేశ్వర స్వామి కల్యాణం, మార్చి 19న రథోత్సవం, రాత్రికి దోపోత్సవం, 20న చక్ర తీర్థం, పూర్ణాహుతి, నాగవళి, దేవతాఉద్వాసన కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో

కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

- పార్టీని గెలిపించండి.. కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటాం
- వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సునీతామహేందర్‌రెడ్డి

చేవెళ్ల, మార్చి 11: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని వికారాబాద్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశం కేజీఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన కార్యకర్తలున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేసే బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. సీనియర్ నాయకులు కోరడంతోనే తాను బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరానని చెప్పారు. నిత్యం పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చల్లా నర్సింహరెడ్డి, భీంభరత్ మాట్లాడుతూ చేవెళ్లగడ్డ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ జెండా ఎగరవేయాలన్నారు. చేవెళ్ల ప్రాంతానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి పనులు ప్రారంభించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే కష్టపడ్డారో అంతకు మించి ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించారు. అనంతరం వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి సమక్షంలో మొయినాబాద్, నవాబ్‌పేట్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి, టీపీసీసీ కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, సీనియర్ నాయకులు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్, బల్వంత్‌రెడ్డి, వనం లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్, శ్రీనివాస్, కుంచం శివకుమార్‌గుప్తా, పాండుగౌడ్, సత్యనారాయణ, మధుసూదన్ గుప్తా, శ్రీకాంత్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ శశాంక

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 11 : పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 18 నుండి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షలను సజావుగా, ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లాలో 237 పరీక్ష కేంద్రాల్లో 50,946 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు 37 పోలీస్‌స్టేషన్లను గుర్తించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. కేంద్రం వద్ద అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆశా వర్కర్ ఏఎన్ఎంలను, సిబ్బంది అందుబాటులో ఉంచాలని వైద్యాధికారికి సూచించారు. పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకొని బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు సరైన సమయంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు నడపాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసేందుకు వీలుగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్లు కలెక్టర్ శశాంక్ తెలపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు చూడాలన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో మహిళా కానిస్టేబుల్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ శశాంక తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, పోలీసు, ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ

తాండూరు: మార్చి 11: తాండూరు మున్సిపల్ పరిధిలో మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్‌లను పంపిణీ చేశారు. వైట్ ప్యాలెస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి , మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, నిర్వాహకులు ముజీబ్ పాల్గొన్నారు.


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే

పాంబండ పెద్ద జాతరలో కొబ్బరికాయల విక్రయానికి వేలం

కులకచర్ల, మార్చి 11: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పెద్ద జాతర సందర్భంగా కొబ్బరి కాయల విక్రయానికి మంగళవారం దేవాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సమ్మ రాములు, ఏవో సుధాకర్ తెలిపారు. గతంలో వాయిదా పడిన కొబ్బరి కాయల వేలం పాటను మళ్లీ నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పొందిన వారు పాంబండ పెద్ద జాతర సందర్భంగా మార్చి 30 నుంచి ఏప్రిల్ 9 వరకు కొబ్బరి కాయలు విక్రయించేందుకు వీలుంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా డిపాజిట్ చేయాలన్నారు.

మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్‌గా హన్మంతు

కొడంగల్ రూరల్, మార్చి 11: మత్స్యశాఖ వికారాబాద్ జిల్లా డైరెక్టర్‌గా కొడంగల్ మండలంలోని పెద్దనందిగామ గ్రామానికి చెందిన కె.హన్మంతు ఎన్నికయ్యారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన చైర్మన్, డైరెక్టర్‌ల ఎన్నికలో సోమవారం ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


నియామకపత్రం అందుకుంటున్న హన్మంతు

సామాజిక న్యాయం కాంగ్రెస్ ధ్యేయం

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్
- కడ్తాల్‌లో ప్రజా పాలన యాత్ర



కడ్తాల నుంచి మైసిగండికి పాదయాత్రగా వెళ్తున్న సంపత్ కుమార్, నాయకులు, కార్యకర్తలు

కడ్తాల్, మార్చి 11 : సామాజిక న్యాయం, సమానత్వం కాంగ్రెస్ ప్రజా పాలన ధ్యేయం అని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. లోక్‌సభఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి ఢిల్లీలో అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజులు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని 'రేవంతన్నకు దండుగా.. ప్రజా పాలనకు అండగా..'అనే కార్యక్రమాన్ని సోమవారం సంపత్‌కుమార్ కడ్తాలలో నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలిసి పాదయాత్రగా మైసిగండికి చేరుకొని మైసమ్మ ఆలయాన్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ మత రాజకీయాలు చేస్తోందన్నారు. బీజేపీకి ప్రజలు బుద్ధిచెప్పే సమయం ఆసన్నమైందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ నియంతృత్వం, అవినీతి పాలనకు ప్రజలు చరమగీతం పాడినట్టే బీజేపీని సైతం ఇంటికి పంపుతారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజల ఆకాంక్షల మేరకు పాలన సాగిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పోటీ చేసేందుకు అభ్యర్థులే కరువయ్యారని సంపత్ కుమార్ ఎద్దేవా చేశారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగేనన్నారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ లోక్‌సభా స్థానాల్లో కాంగ్రెస్ విజయం తథ్యం అన్నారు. నాగర్‌కర్నూల్ రిజర్వ్‌డ్ స్థానం నుంచి దరఖాస్తు చేసుకున్న 26మందిలో కాంగ్రెస్ టికెట్ ఎవరికి వచ్చినా మిగతా వారంతా పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ.. బీజేపీ విచ్చిన్నకర, విద్వేష పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమం లో పీసీసీ సభ్యుడు ఐళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జగన్, ఎంపీపీలు కమ్లీమోత్యా, అనితవిజయ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బిచ్యానాయక్, జగన్, డి.ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్,ఎం.అంజయ్యగుప్తా, లక్ష్మణ్, జహంగీర్ అలీ, రాంచందర్, కృష్ణ, శేఖర్‌గౌడ్, శంకర్, లక్ష్మయ్య, జవహర్‌లాల్, సురేశ్, హీరాసింగ్, పి.శ్రీశైలం, రామకృష్ణ, ఎం.మల్లేశ్‌గౌడ్, తులసీరామ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి



మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, ఎంపీడీవో, తహసీల్దార్ తదితరులు

యాచారం, మార్చి 11 : రోజు రోజుకూ ఎండలు ముదురుతున్న నేపథ్యంలో బోర్లలో నీరు అడుగంటుతోందని, ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఎండల తీవ్రత దృష్ట్యా నీటి సరఫరాను మరింత పెంచాలని ఎంపీపీ ఆర్‌డబ్ల్యూస్, మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాను మరింత పెంచాలని కోరుతూ కలెక్టర్, జెడ్పీ సీఈవో, సంబంధిత శాఖల అధికారులను కోరుతాం అన్నారు. గ్రామాల్లో పశువుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి తొట్లలో 24 గంటలూ నీటిని ఉంచాలని ఎంపీపీ పంచాయతీ అధికారులను ఆదేశించారు. గత వానకాలంలో వర్షాలు సరిగా పడనందున మూగ జీవాలకు చెరువుల్లో నీరు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎండ కాలంలో మూగ జీవుల కోసం నీటిని ఏర్పాటు చేయడం మనందరి బాధ్యతన్నారు. యాసంగిలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామని ఏవో సందీప్ కుమార్ సభ్యులకు తెలిపారు. మల్చింగ్‌తో పంటలు సాగు చేసుకోవాలని డివిజనల్ ఉద్యాన అధికారి కనకమహాలక్ష్మి రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ మొక్కల పెంపకానికి 90శాతం సబ్సిడీ ఉందని ఆమె తెలిపారు. 234 పశువులకు కృత్రిమ గర్భధారణ చేశామని వెటర్నరీ డాక్టర్ రేఖ తెలిపారు. అలాగే మండలంలో 1,064 పశువులకు నట్టల నివారణ మందు వేశామన్నారు. నెల రోజుల్లో 9,653 మంది ఔట్ అండ్ ఇన్ పేషెంట్లకు సేవలందించామని డాక్టర్ రాజ్యలక్ష్మి చెప్పారు. టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంఈవో వెంకటరెడ్డి చెప్పారు. 804సంఘాలకు బ్యాంక్‌లింకేజీతో రూ.42.32కోట్ల రుణాలిచ్చే లక్ష్యాన్ని పెట్టుకున్నామని ఐకేపీ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి చెప్పారు. ఉపాధి కూలీలకు పనులు కల్పిస్తున్నామని ఏపీఎం లింగయ్య తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కేవలం ఎన్నికలపైనే విపక్షాల దృష్టి : కొండా



శంకర్‌పల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, మార్చి 11: బీజేపీ దృష్టి ఎప్పుడూ దేశాభివృద్ధిపై ఉంటుందని, కానీ విపక్షాల ధ్యాస మాత్రం ఎప్పుడూ ఓట్లు సీట్లపై ఉంటుందని చేవెళ్ల మాజీ ఎంపీ, వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వారితో ఆయన మాట్లాడుతూ కేవలం ఎన్నికల కోసం బీజేపీ పనిచేయదని, దేశాభివృద్ధే పార్టీ లక్ష్యం అన్నారు. పేదల అభ్యున్నతికి పాటుపడేది బీజేపీ మాత్రమే అన్నారు. కానీ విపక్షాలు మాత్రం ఎన్నికల్లో ఓట్ల కోసమే రాజకీయాలు చేస్తాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ పేరు మార్మోగుతోందన్నారు. ఓ సర్వేలో అమెరికా, బ్రిటన్, జపాన్, జర్మనీ దేశాధినేతలను తోసిరాజని అత్యంత ప్రజాదరణ ఉన్న నేతగా మోదీ గుర్తింపు పొందారన్నారు. బీఆర్ఎస్ పాలకులు రాష్ట్ర ధనాన్నంతా కాళేశ్వరంలో కుమ్మరించారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలంతా పనిచేయాలన్నారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, మహిళామోర్చా అధ్యక్షురాలు గాయత్రి, విశ్వారెడ్డి, రాజకుమార్, రాజాచంద్ర, రాజేంద్రసింగ్ పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలి



వినతిపత్రాన్ని ఎస్బీఐ గేట్‌కు అతికిస్తున్న నాయకులు

పరిగి, మార్చి 11 : ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య అన్నారు. రాజకీయ పార్టీల చందాలకు సంబంధించిన ఎలక్టోరల్ బాండ్లను రద్దు చేస్తూ బాండ్ల వివరాలు సుప్రీం కోర్టుకు, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు మార్చి 13 కల్లా అందజేయాలని సుప్రీం కోర్టు ఆదేశించినా బీజేపీ ఒత్తిడితో ఎస్బీఐ ఇప్పటి వరకు వివ రాలు ఇవ్వడం లేదన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పరిగిలో ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ధర్నా చేశారు. వినతిపత్రాన్ని మేనేజర్ తీసుకోకపోవడంతో గేట్‌కు అతికించారు. నాయకులు మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని 2018, ఏప్రిల్ 18న బీజేపీ ప్రభుత్వం తెచ్చిందన్నారు. రాజకీయ పార్టీలకు విరాళాలు నేరుగా ఎస్బీఐలో జమ చేసే విధానమే ఇదన్నారు. దీనిపై నల్లధనం, తెల్లధనం అనే వివరాలు అడగరన్నారు. రాజకీయ పార్టీల విరాళాలపై సమాచారం ఇవ్వకపోవడం సరికాదన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను వెంటనే అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు హబీబ్, సత్తయ్య, యాదగిరి, రఘురామ్, చెన్నారెడ్డి, కృష్ణ, రాంరెడ్డి, అమీర్ పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష



అధికారులు, ముస్లిం ప్రతినిధులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: మార్చి 11 : రంజాన్ మాసం ఏర్పాట్లపై సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పలు శాఖల అధికారులు, ముస్లిం ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. మసీదులకు, గృహాలకు తాగు నీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలన్నారు. మున్సిపల్ కార్మికులు మసీదుల వద్ద ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అందరూ స్నేహ భావంతో పండుగ జరుపుకోవాలని మనోహర్‌రెడ్డి అన్నారు. పండుగను ప్రశాంతంగా జరుపుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రమసింహారెడ్డి, సీఐ సంతోష్‌కుమార్, ముజీబ్, యూసుఫ్, అబ్దుల్‌రవూఫ్, కౌన్సిలర్ నీరజ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని ఆలయ భూముల కొలతలు



ఆలయ భూములను పరిశీలిస్తున్న సర్వేయర్లు, గ్రామస్తులు

కడ్తాల్, మార్చి 11 : కడ్తాలలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ భూములు కబ్జా అవుతున్నాయని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆలయ భూమిని పరిశీలించిన అధికారులు భూమి సరిహద్దులను తేల్చలేదని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆలయానికి 41ఎకరాల భూమి ఉందని, సర్వే నంబర్120లో 15.31 ఎకరాల హద్దులు నిర్ధారించేందుకు జాప్యం ఎందుకు చేస్తున్నారని సర్వే అధికారులపై మండిపడుతున్నారు. సోమవారం సర్వే అధికారులు డీఐ కృష్ణయ్య, సర్వేయర్ పాండురంగారెడ్డి వచ్చిన సర్వేను మరోసారి వాయిదా వేయడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 120సర్వేనంబర్ భూమికి వెంటనే హద్దులు పాతాలని డిమాండ్ చేస్తున్నారు. ఆలస్యం అయితే ఉన్న భూమిని కూడా కబ్జా చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో మోహన్‌రావు, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, కమిటీ సభ్యులు గూడూరు జంగారెడ్డి, సాయిరెడ్డి, టీక్‌లాల్, బిక్యానాయక్, అర్చకులు శ్రీధర్, పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి సేవలందించిన గొప్ప వ్యక్తి జగ్జీవన్ రామ్ : మంద కృష్ణ



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంద కృష్ణ

మేడ్చల్ టౌన్, మార్చి 11 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డబిల్‌పూర్‌లో నెలకొల్పిన బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రజలకు సేవలందించి గొప్ప వ్యక్తి జగ్జీవన్‌రామ్ అన్నారు. ఆయన్ను రాబోయే తరాలు గుర్తుంచుకునేందుకే గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. వర్గీకరణ సాధన ఉద్యమం నిరుపేద దళితుల కోసం నిరంతరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రజితారెడ్డి, మాజీ సర్పంచ్ గీతారెడ్డి, నాయకులు రాజమల్లారెడ్డి, బాబుల్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం!

బషీరాబాద్, మార్చి 11 : కంసాన్‌పల్లి(ఎం)లో అంగన్‌వాడీ భవనం అసంపూర్తి మిగిగిపోయింది. అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేక చిన్నారులను స్థానిక పాఠశాల ఆవరణలో కూర్చోబెడుతున్నారు. ఐదేళ్ల కింద రూ.7లక్షలతో మొదలుపెట్టిన భవనాన్ని కాంట్రాక్టర్ స్లాబ్ వేసి వదిలేశాడు. అధికారులూ పట్టించుకోవడం లేదు.స్లాబ్ వరకే బిల్లు వచ్చిందని కాంట్రాక్టర్ అంటున్నాడు. అధికారులు నిర్మాణాన్ని పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా శివగంగ రాజరాజేశ్వరాలయ రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

మహేశ్వరం, మార్చి 11 : మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరాలయంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి రుద్రహోమం, రథోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి స్వామి వారి రథాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. యువకులు పోటీపడి రథాన్ని లాగారు. వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఐదు రోజులు వైభవోపేతంగా సాగిన బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి లలిత సహస్రపారాయణం, దోపోత్సవంతో ముగిశాయి. ఆలయ కమిటీ చైర్మన్ అల్లెకుమార్ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్.సునీత, మాజీ చైర్మన్లు కూన యాదయ్య, కాకి ఈశ్వర్, సుధీర్‌గౌడ్, పోతర్ల సుదర్శన్, నవీన్, కుమార్, డైరెక్టర్లు రాకేష్, జగన్, సాయిలు, కన్నయ్య, శ్రీశైలం, నాయకులు పూర్ణచంద్రారెడ్డి, ఆనందం, సూర్యనారాయణరెడ్డి, జి.జంగయ్య, భిక్షపతి, సత్యనారాయణ, కె.చందు, యాదయ్యగౌడ్, మల్లేష్, మైసయ్య, శ్రీకాంత్, ఆలయ ఈవో మురళీకృష్ణ, ఆలయ ప్రధానార్చకులు వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో ఈటల రాజేందర్ బైక్ ర్యాలీ



బైక్ నడుపుతున్న మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

ఘట్‌కేసర్, మార్చి 11 : ఘట్‌కేసర్‌లో మల్కాజిగిరి లోక్‌సభ ఎంపీ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో బోడుప్పల్‌లోని మల్లన్నగుడి నుంచి ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు 100 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఈటల రాజేందర్ బైక్ నడిపారు. బైక్ ర్యాలీ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, విక్రంరెడ్డి, హనుమాన్, మోహన్‌రెడ్డి, సురేష్, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి ఘటనపై విచారణ జరుపుతున్నాం : ఆర్డీవో



రికార్డు విభాగంలో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

కొందుర్గు, మార్చి, 11 : విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన హరీశ్వర్‌రెడ్డి(ఆర్మీ జవాన్ అశోక్‌రెడ్డి అన్న) తన భూమికి సంబంధించిన ఆర్వోఆర్, పహాణీల గురించి దరఖాస్తు చేయగా రికార్డు అసిస్టెంట్ బాల్‌రాజ్, మరో ప్రైవేట్ వ్యక్తి డబ్బులు తీసుకున్న సంఘటనపై విచారణ చేపడుతున్నామని షాద్‌నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటమాధవరావు తెలిపారు. సోమవారం కొందుర్గు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. కార్యాలయ గదులను, రికార్డు విభాగాన్ని పరిశీలించారు. వివరాలను డిప్యూటీ తహశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడారు. ఆర్వోఆర్, పహాణీల కోసం తహసీల్దార్ కార్యాలయంలోనే రైతులు దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వీటి జిరాక్స్ పత్రాలివ్వడానికి నెల రోజుల సమయం పడుతుందని ఆర్డీవో తేల్చి చెప్పారు. మరి కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తిని ఎందుకు పెట్టుకున్నారని విలేకరులు ప్రశ్నించగా, ఇప్పటికే కార్యాలయంలో ముగ్గురు రికార్డు అసిస్టెంట్లు ఉన్నారని, ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకోవాల్సిన అవసరమే లేదన్నారు. ప్రస్తుతం శ్రీనివాస్ రికార్డు విభాగాన్ని చూస్తున్నారని తహసీల్దార్ రమేష్‌కుమార్ తెలిపారు. దరఖాస్తుదారు హరీశ్వర్‌రెడ్డితో మాట్లాడతానని ఆర్డీవో చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిన సంతాపూర్ ఎంపీటీసీ



ఎంపీటీసీ రాజుకు కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కేశంపేట, మార్చి 11 : గతంలో కాంగ్రెస్‌లో ఉన్న సంతాపూర్ ఎంపీటీసీ రాజు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేష్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్వారి జగదీశ్వర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌ను ముమ్మరం చేసింది. మండలంలో మెజారిటీ ఎంపీటీసీ సభ్యులను కాంగ్రెస్‌లో చేర్చుకునే చర్యలను చేపట్టింది. కాంగ్రెస్‌పై అభిమానం ఉన్నవారిని మొదటగా చేర్చుకునే ప్రణళిక రూపొందిస్తోంది. మండలంలో 12 ఎంపీటీసీలకు కేశంపేట ఎంపీటీసీ యాదయ్య ఎన్నికల ఖర్చు చూపకపోవడంతో అనర్హతకు గురయ్యాడు. మిగతా 11 మందిలో ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట, వేముల్‌నర్వ మినహా 8 మంది ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం అయినట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వం ఎంపీటీసీలను పార్టీలో చేర్చుకునేందుకు చర్యలను ముమ్మరం చేసింది. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఎంపీటీలు ఓటు హక్కు వినియోగించుకుంటారు.

స్టేజీల వద్ద బస్సులు ఆపడం లేదని మహిళల నిరసన



తొండపల్లిలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

పరిగి, మార్చి 11 : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు నుంచి బస్సులను స్టేజీల వద్ద సరిగ్గా నిలపడం లేదని సోమవారం తొండపల్లిలో మహిళలు రోడ్డుపై ఆందోళన చేశారు. ఆర్టీసీ సిబ్బంది, అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిగి-షాద్‌నగర్ రోడ్డుపై బైఠాయించారు. ఉచిత రవాణ కల్పిస్తున్నప్పటి నుంచే బస్సులు ఆపడం లేదన్నారు. గంటకుపైగా నిరసన చేపట్టడంతో వాహనాల రాకపోకలు నిలిచాయి. దీంతో పోలీసులు వచ్చి ఆర్టీసీ డీఎంతో మాట్లాడారు. బస్సులు నిలుపుతామని ఆయన చెప్పడంతో ఆందోళనను విరమించారు.

'పట్నం' మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం

● అదనపు కలెక్టర్‌కు ప్రతిని అందజేసిన సభ్యులు

ఇబ్రహీంపట్నం, మార్చి 11: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరి (బీఆర్ఎస్)పై సహచర కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు నోటీసులు అందజేశారు. మున్సిపాలిటీలో 24 మంది సభ్యులుండగా 16 మంది ఈ అవిశ్వాస తీర్మాన ప్రతిపై సంతకాలు చేశారు. సంతకాలు చేసిన వారిలో ఏడుగురు బీఆర్ఎస్, 9 మంది కాంగ్రెస్ సభ్యులున్నారు. ఇటీవలే బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ఇక్కడి మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి (కాంగ్రెస్)పై అవిశ్వాసం ప్రకటించగా అది వీగిపోయిన విషయం తెలిసిందే. మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ యాదగిరిపై అవిశ్వాసం విషయం తెరపైకి వచ్చింది.

మీ సేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మార్వో



మీసేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మార్వో

యాచారం, మార్చి 11 : మండల కేంద్రంలో కొన్నేళ్లుగా నడుస్తున్న మీ సేవా కేంద్రాన్ని యాచారం ఎమ్మార్వో టి. అయ్యప్ప సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మీసేవా కేంద్రం నిర్వాహకుల పనితీరు బాగుందని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రజలకు సేవలందిస్తున్నారని ఆయన అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూముల రిజిస్ట్రేషన్లు గంటల వ్యవధిలో సాగుతున్నాయని, రైతులకు మరిన్ని నాణ్యమైన సేవలందించడానికి మీసేవా కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు.

భట్టిని అవమానించడం బాధాకరం

చేవెళ్ల, మార్చి 11 : యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కాంగ్రెస్ నాయకులు ఘోరంగా అవమానించారని, ఇది బాధాకరమని బీఎస్పీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ మహేంద్రవర్మ సోమవారం ఓ ప్రకటనలో చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో రెడ్డి రాజ్యం కొనసాగుతోందని ఆరోపించారు. దళితులను కించపరిచే నైజాన్ని ఆ పార్టీ బయటపెట్టుకుందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వారి పక్కన భట్టి విక్రమార్కను కింద కూర్చోబెట్టి అవమానించారని ఆరోపించారు. కాంగ్రెస్‌లోని దళిత నాయకులు తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కేసీఆర్‌ను కలిసి గిరిజన సంఘం నేతలు



కేసీఆర్‌ను కలిసిన ప్రవీణ్‌నాయక్ తదితరులు

కందుకూరు, మార్చి 11 : గిరిజన సంఘం మండల నేతలు సోమవారం మాజీ సీఎం కేసీఆర్‌ను మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డితోపాటు కలిశారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులను పూర్తి స్థాయిలో అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. సాయిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ గోవర్ధన్‌నాయక్, గిరిజన సంఘం జిల్లా నేత ప్రవీణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన భరత్‌ప్రసాద్



భరత్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న నర్సింహారెడ్డి

ఆమనగల్లు, మార్చి 11 : బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ సోమవారం ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ అభ్యర్థిత్వం ఖరారయ్యాక తొలిసారి తన వద్దకు వచ్చిన భరత్‌ప్రసాద్‌ను నర్సింహారెడ్డి సత్కరించి అభినందించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని నర్సింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భరత్ ప్రసాద్ విజయం కోసం పార్టీ శ్రేణులంతా కలిసి కట్టుగా పనిచేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

కందుకూరు, మార్చి 11 : కందుకూరులో ఆధార్ కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరానికి అతి సమీపంలో ఉన్న కందుకూరు మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడం విడ్డూరమని అన్నారు. ఆధార్ కార్డులో చేర్పులు మార్పులు చేసుకోవడానికి రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఒక్క సెంటర్ కూడా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆధార్ నమోదు కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



ఆర్థిక సహాయం అందిస్తున్న మిత్రులు

కందుకూరు, మార్చి 11 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు తమ తోటి మిత్రుడు మృతి చెందడంతో అతని కుటుంబానికి చేయూతనిచ్చారు. కేశంపేట మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన శ్రీశైలం ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. అతనితో కలిసి పదోతరగతి చదువుకున్న స్నేహితులంతా కలిసి రూ.50వేల ఆర్థిక సహాయం చేసి బాసటగా నిలిచారు. సాధ మల్లారెడ్డి, వరలక్ష్మీ, సునీత, సంతోష, అంజయ్య, జనార్ధన్, సుదర్శన్, లక్ష్మారెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి, యాదగిరి, జంగయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

వైభవంగా శివ పార్వతుల రథోత్సవం

● లాగడానికి పోటీపడ్డ భక్తులు

● ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



కేశంపేట : రథం ముందు కోలాట ప్రదర్శన

కేశంపేట, మార్చి 11 : మండల పరిధిలోని కాకునూర్ గ్రామ శివారులో వెలసిన మహాలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించిన రథంపై ఉంచి ఆలయం నుంచి వీధులగుండా గ్రామంలోనికి స్వామివారిని ఊరేగింపుగా తీసుకవచ్చారు. ఈ సమయంలో భక్తులు రథం ముందు నీళ్లు పోసి స్వాగతం పలికారు. రథోత్సవంలో కళాకారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాళ్ల నర్సింలుగౌడ్, ప్యాక్స్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, కొడూరి రాములు, పర్వతాలు, మోటే శ్రీనివాస్, నర్సింహా, జయమ్మ, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, శ్రీశైలం, మల్లేష్, భీమయ్య, ఆలయ పూజారి కుమారస్వామి పాల్గొన్నారు.



సబితారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గూడ కృష్ణమాచార్యులు

ఇంటింటికీ అయోధ్య ప్రసాదం పంపిణీ

శంషాబాద్ : బీజేపీ శంషాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు మాదిరెడ్డి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్బీనగర్ బస్తీలో సోమవారం ఇంటింటికీ అయోధ్య ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ అయోధ్య మందిరాన్ని దర్శించుకోలేని వారి కోసం చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి ప్రసాదం పంపించారని, దాన్ని తాము ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కే. జనార్దన్‌రెడ్డి, రవికాంత్, ముకుంద్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వెంకటగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 16 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని సోమవారం ఆమనగల్లులో ఆయన ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కృష్ణమాచార్యులు ఆహ్వానం అందజేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్, మార్చి 11 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. కొల్లాపూర్ నుంచి హైదరాబాద్ వెళుతున్న ఆయన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరిన వారికి రాయికల్ శివారులో జాతీయ రహదారి పక్కన ఉన్న దాబా వద్ద కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడ ఎంపీటీసీ పాత్లావత్ లక్ష్మీ సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యకర్తల సమిష్టి కృషితోనే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిందని అన్నారు. అదే స్ఫూర్తితో ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని చెప్పారు. జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, నాయకులు శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, రాజుగౌడ్ పాల్గొన్నారు.

ఓర్వలేకనే అంతర్గత విభేదాలు సృష్టించి లబ్ధి..

ఆమనగల్లు : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని కొన్ని స్వార్థ శక్తులు పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి కోసం యత్నిస్తున్నాయని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. విపక్షాల అవకాశ వాద రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టక తప్పదని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులకు సముచిత స్థానం కల్పించి వారి ఆత్మగౌరవం పెంచిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. యాదాద్రి ఆలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్న పూజా కార్యక్రమంపై కొన్ని పార్టీలు, వ్యక్తులు విష ప్రచారం చేయడం వారి అవకాశ వాద రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. భట్టి విక్రమార్కకు తమ ప్రభుత్వంలో సముచిత గౌరవం లభిస్తోందని, ప్రధాని వద్దకు వెళ్లినా సీఎం రేవంత్‌రెడ్డి ఆయనను తన వెంట తీసుకువెళ్లిన విషయాన్ని ప్రజలంతా గుర్తించాలన్నారు. గతంలో సీఎం కేసీఆర్ ఎక్కడికైనా వెళ్లినపుడు నాటి ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీని వెంట తీసుకుపోయారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి తో పాటు మంత్రులందరికి తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అనేక మంది దళితులకు కాంగ్రెస్ పార్టీ ఉప ముఖ్యమంత్రులుగా అవకాశం కల్పించిన విషయాన్ని ప్రజలు గుర్తించాలని చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న మల్లు రవి

తిరుగులేని శక్తిగా బీజేపీ

ఆమనగల్లు , మార్చి 11 : మోదీ పదేళ్ల పాలనలో దేశం అద్భుత విజయాలు సాధించిందని, బీజేపీ దేశంలో తిరుగులేని శక్తిగా ఎదిగిందని ఆ పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా సెల్ కన్వీనర్ నేనావత్ రవిరాథోడ్ అన్నారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎన్నికైన రవిరాథోడ్‌కు సోమవారం ఆమనగల్లులో ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు, బీజేపీ నాయకులు అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించడం లేదని ఈ నేపథ్యంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలువబోతుందన్నారు. ఆ పార్టీలకు ఓటు వేస్తే వృథా అని అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో నిర్వహించే రాష్ట్ర సోషల్ మీడియా వాలంటీర్స్ ప్రోగ్రామ్, బహిరంగ సభకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు రవిరాథోడ్ తెలిపారు. సోషల్ మీడియా కన్వీనర్లు తరలిరావాలని కోరారు. బాలకృష్ణ, నరేశ్, అంజన్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు



మాట్లాడుతున్న రాజేష్

చేవెళ్ల, మార్చి 11 : కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు వివిధ రకాల ఫీజుల పేరిట అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉండి కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతూ, నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధిక ఫీజులను నియంత్రించాలని చెప్పారు. సమావేశంలో నాయకులు జైపాల్, శ్రీకాంత్, సురేశ్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



జీవన్‌రెడ్డితో కసిరెడ్డి, తదితరులు

ఆమనగల్లు, మార్చి 11 : మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే ఘనవిజయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి సోమవారం కల్వకుర్తి నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ఎంపీటీసీలు, జడ్పీటీసీలు కాంగ్రెస్ వైపు ఉన్నారని ఈఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు, జిల్లా నాయకులు భాస్కర్ రెడ్డి ఉన్నారు.

కడ్తాల్ : గ్రామీణ ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రజాపాలన ధ్యేమని ఎంపీటీసీల సంఘం గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో, ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జహంగీర్‌అలీ, యాదగిరిరెడ్డి, మల్లేష్‌గౌడ్, రాజేశ్, రాంచందర్‌నాయక్, శేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ధరణి పేరిట రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న జంగారెడ్డి, తదితరులు

కందుకూరు, మార్చి 11 : ధరణిలో లోపాలున్నాయని చెబుతూ కాంగ్రెస్ రైతులను మోసం చేస్తోందని, వారి సమస్యల పరిష్కారానికి ఏనాడు ఆ పార్టీ పనిచేయలేదని కందుకూరు జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం జడ్పీటీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ధరణి పేరుతో బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకులు వారి ప్రభుత్వం వచ్చాక ఆ సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. ఇటీవల ధరణి సమస్యల పరిష్కారం కోసం స్పెషల్‌డ్రైవ్ చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి పరిష్కారం చూపలేదని విమర్శించారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో రెండు సంవత్సరాలుగా 4వేల దరకాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తాళ్ల కార్తీక్, బర్కం వెంకటేష్, సోమయ్య, ఎడ్ల రాంరెడ్డి, బొక్క దీక్షిత్‌రెడ్డి, పాల్గొన్నారు.

రంజాన్ నెల ప్రారంభం



రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా షాద్‌నగర్‌లో వెలసిన హలీం సెంటర్

యువత క్రీడల్లో రాణించాలి



షీల్డ్‌ను అందిస్తున్న నాయకులు

చేవెళ్ల, మార్చి 11 : విద్యార్థులు, యువత రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాల్లో రాణించి, మంచి గుర్తింపు సాధించాలని దామరగిద్ద గ్రామ మాజీ సర్పంచ్‌లు వెంకటేశం గుప్తా, మధుసూదన్‌గుప్తా అన్నారు. ఆ గ్రామంలో సీనియర్ నేషనల్ మాజీ క్రీడాకారుడు బోడ అనిల్ కుమార్ స్మారక జిల్లాస్థాయి ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో షాద్‌నగర్‌కు చెందిన జట్టు ప్రథమ స్థానంలో, రెండవ స్థానంలో దామరగిద్ద జట్టు నిలిచింది. షాద్‌నగర్ జట్టుకు రూ. 70 వేలు నగదులో పాటు షీల్డ్, దామరగిద్ద జట్టుకు రూ. 50 వేల నగదుతోపాటు షీల్డ్‌ను అందించారు. మూడవ స్థానంలో నిలిచిన ఆజీజ్‌నగర్ జట్టుకు రూ. 30 వేలు నగదుతోపాటు షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు డప్పు రాజు, బోడ సామేల్, బోడ వెంకటేశ్, సీమోన్, రవి, మహేందర్, శ్రీహరి, మహేందర్, గ్రామస్థులు, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

రంగసముద్రాన్ని కాపాడాలని కలెక్టర్‌కు వినతి

మాడ్గుల, మార్చి 11 : మండలంలోని గిరికొత్తపల్లి గ్రామంలో ఉన్న రంగసముదాన్ని కాపాడాలని సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు రైతుసంఘం నాయకులు వినతిపత్రం అందచేశారు. చెరువు చెక్‌డ్యామ్, తూము, కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రంగసముద్రం చెరువు కింద 300ఎకరాల ఆయకట్టు ఉందని, నలుగేళ్ల క్రితం కొంతమంది రియాల్టర్లు అక్రమంగా, దురుద్దేశంతో చెరువు ధ్వంసం చేసినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. చెక్‌డ్యామ్‌ను ధ్వంసం చేయటం వల్ల రంగసముద్రం చెరువు కింద ఉన్న చాకలి కుంట, కుమ్మరికుంటకు నీరువచ్చే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. చెరువు కట్టను పునరుద్ధరించాలని, ఎఫ్టీఎల్ సరిహద్దులను గుర్తించాలని కలెక్టర్‌ను కోరారు.

క్రైం కార్నర్

తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగల బీభత్సం

● ఏడున్నర తులాల బంగారం, వెండి, నగదు అపహరణ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

షాద్‌నగర్‌రూరల్, మార్చి 11 : షాద్‌నగర్ పట్టణంలోని సాయిబాబా కాలనీ, మల్లికార్జునకాలనీలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లల్లో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడి బీభత్సం సృష్టించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నాట్కో పరిశ్రమలో పని చేసే వరద శివరాం అనే వ్యక్తి పట్టణంలోని సాయిబాబా కాలనీలో నివాసముంటున్నాడు. అనారోగ్యం కారణంగా మూడు రోజుల క్రితం తన భార్యా పిల్లలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని స్వగ్రామానికి వెళ్లాడు. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు గేటు ప్రధానద్వారం తాళం విరుగ్గొట్టి ఇంటి లోపలికి ప్రవేశించారు. ముందుగా సీసీ కెమెరా హార్డ్‌డిస్క్‌ను ధ్వంసం చేశారు. అనంతరం బీరువాలో ఉన్న 3 తులాల బంగారు నెక్లెస్, కిలోకు పైగా వెండి వస్తువులు, రూ. 20 వేల నగదు అపహరించుకుపోయారు. ఆదివారం సాయంత్రం శివరాం ఇంటి తలుపు తెరిచి ఉండడం గమనించి ఇంటి పక్క వారు స్వగ్రామంలో ఉన్న అతనికి సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే వచ్చి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి ఆదివారం రాత్రి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా అదే రోజు రాత్రి మల్లికార్జున కాలనీలో తాళం వేసి ఉన్న మరో ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. రెడ్యానాయక్ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లగా బీరువాలో ఉన్న 4 తులాల బంగారు గొలుసు, అరతులం బంగారు ఉంగరం, 30 తులాల వెండిని దొంగలు అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

ఆమనగల్లు, మార్చి 11 : మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామం వద్ద ఆమనగల్లు-మాడ్గుల ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన దార్ల రాములు, ఆయన సోదరుడు దార్ల లక్ష్మయ్య బైక్‌పై ఆమనగల్లుకు వస్తున్నారు. ఆమనగల్లు నుంచి ఆకుతోటపల్లికి విడియాల ప్రసాద్ అనే ఉపాధ్యాయుడు బైక్‌పై పాఠశాలకు వెళుతున్నాడు. జంగారెడ్డిపల్లి గ్రామం వద్ద వారి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రాములు, లక్ష్మయ్య, ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం రాములు , లక్ష్మయ్యను ఉస్మానియా ఆసుపత్రికి, ప్రసాద్‌ను వెల్దండ సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారిలో లక్ష్మయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

వివాహిత కిడ్నాప్

ఆదిభట్ల, మార్చి 11 : ప్రేమ వివాహం చేసుకుని భర్తతో కలిసి ఉంటున్న ఓ యువతిని ఆమె కుటుంబ సభ్యులు బలవంతగా తీసుకెళ్లిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్‌జిల్లా, ఊరకొండ మండలం, జకినాలపల్లి గ్రామానికి చెందిన పోలె ప్రవీణ్ అదే గ్రామానికి చెందిన రాధిక(19) ప్రేమించుకున్నారు. గత నెల 19న కడ్తాల్‌లోని వీరభద్రస్వామి దేవాలయంలో పెళ్లి చేసుకున్నారు. మహేశ్వరం మండలం, రావిరాలలో ఉంటున్న ప్రవీన్ సోదరి మమత సహకారంతో అదే గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. కాగా సోమవారం ఉదయం 7:30 గంటలకు ఇంట్లో ఒంటరిగా ఉన్న రాధిక ప్రవీణ్ సోదరి ఇంటికి వెళ్లి మాట్లాడుతుండగా ఆమె తల్లి జంగమ్మ, పెద్దమ్మ సుగుణమ్మ, చిన్నమ్మ బంగారమ్మ, సోదరుడు ఏసు, బావ కిరణ్‌లు వచ్చి గొడవ చేసి బలవంతగా కారులో తీసుకెళ్లారు. మమత తన తమ్ముడికి ఫోన్ చేసి చెప్పడంతో అక్కడికి చేరుకున్న ప్రవీన్ సోమవారం సాయంత్రం ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక ఫిల్టర్లపై పోలీసుల దాడి

తలకొండపల్లి, మార్చి 11 : మండల పరిధిలోని పడకల్ గ్రామ శివారులోని వాగులో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక ఫిల్టర్లపై సోమవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. కొంత కాలంగా వాగులో ఫిల్టర్ ఇసుక తయారు చేసి అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి నిర్వహించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఫిల్టర్ వద్ద ఉన్న అంజనేయులు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా కేశంపేట మండలం చౌలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా అని తెలిసిందన్నారు. ఈ మేరకు ఇసుక డంపులో ట్రాక్టర్, జేసీబీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

బర్కత్‌పుర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఓ డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైంది. రంగారెడ్డి జిల్లా కందుకూరుకు చెందిన రాజు కుమార్తె కుసుమ(19) నగరంలోని కోఠి ఉమెన్స్ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతూ ఇసామియా బజార్‌లోని బాలికల హాస్టల్‌లో ఉంటోంది. ఈనెల 7న ఆమె తల్లి రాజి నగరానికి వచ్చి కుసుమ ఉంటున్న హాస్టల్‌కు వెళ్లింది. కుసుమ కనిపించకపోవడంతో కంగారు పడింది. ఆమె ఆచూకీ లభించకపోవడంతో రాజి సోమవారం రాత్రి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటికీ తిరిగి కుష్ఠు బాధితులను గుర్తించాలి

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 11 : ఇంటింటికీ తిరిగి అనుమానిత కుష్ఠు వ్యాధి బాధితులను గుర్తించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం నుంచి 24వ తేదీ వరకు జాతీయ కుష్ఠు బాధితుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా వైద్యాశాఖ కార్యాలయం వద్ద కుష్ఠు వ్యాధి నిర్మూలన ఇంటింటి కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ అరుణ, డాక్టర్ అనిత, పీఏవో, డీపీఎంవో, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆదిభట్ల, మార్చి 11 : ప్రతివ్యక్తి సమాజం పట్ల కృతజ్ఞత భావం కలిగి ఉంటూ తమ వంతుగా ఇతరులకు సేవలు అందించాలని అనిమల్ హెల్త్ ఇండియా సంస్థ రీజినల్ మేనేజర్ సిరాజుద్దీన్ అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అనిమల్ హెల్త్ ఇండియా సంస్థ సీఎస్సార్ నిధులతో బహూకరించిన ఆర్వోవాటర్ ప్లాంట్‌ను ఆ సంస్థ రీజినల్ మేనేజర్ సిరాజుద్దీన్ హెచ్‌ఎం రాజేశ్వర్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రాంభించారు. వారిని, మరో దాత లింగళ్ల భాస్కర్‌ను హెచ్‌ఎం అభినందించారు. సంస్థ ఏరియా మేనేజర్ శివకుమార్, వెటర్నరీ డాక్టర్ సురేందర్, ఉపాధ్యాయులు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆమనగల్లు, మార్చి 11: ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లి కి చెందిన ప్రమోద్ కూతురు తన్విశ్రీ ఇటీవల మృతి చెందగా సోమవారం బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. నాయకులు రూపం వెంకట్‌రెడ్డి, బన్నె శేఖర్, సుమన్‌నాయక్, ప్రశాంత్, తిరుమలేశ్, మహేశ్, నరేశ్ పాల్గొన్నారు.

తలకొండపల్లి, మార్చి 11 : మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శానమోని చెన్నయ్య అనారోగ్యంతో మృతిచెందగా అతని కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వరలక్ష్మీరాజేందర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు రమేశ్, యాదయ్య, చంద్రారెడ్డి, అనంతరెడ్డి, నర్సింహా, మాధవరెడ్డి, శ్రీనివాసులు, యాదగిరిరెడ్డి, ఉన్నారు.

ఆమనగల్లు, మార్చి 11 : ఆమనగల్లు మున్సిపాలిటీ వెంకటేశ్వర కాలనీ కి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తల్లోజు రామకృష్ణ తండ్రి రామస్వామి సంస్మరణ కార్యక్రమం సోమవారం జరిగింది. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుత్తి బాలస్వామి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఎంగళి రఘు, చుక్క నిరంజన్‌గౌడ్, భాస్కర్, కిరణ్, నిరంజన్ ఉన్నారు.

కడ్తాల్ , మార్చి 11: కడ్తాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాములు అనారోగ్యంతో మృతి చెందాగా విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహ్మా రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థికసహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ వార్డు సభ్యులు మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్, బిక్షపతి, నర్సింహ్మా, చెన్నయ్య, యాదయ్య, పాండు, మహేశ్, బాలరాజు, రాజు, కుమార్ తదితరులు ఉన్నారు.